క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల ధర్నా



పుత్తూరు డిపో వద్ద కార్మికుల ధర్నా

పుత్తూరు: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పుత్తూరు ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. డిపో ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌జే పెరుమాళ్ మాట్లాడుతూ సీపీఎస్ నిలుపుదల చేయాలని, ఆర్‌పీఎస్ అరియర్స్ అందరికీ ఒకేసారి చెల్లించాలని, ఈహెచ్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, మెడికల్ లీవ్‌లో వేతనాలు చెల్లించాలని, గ్యారేజీ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాజీ కార్యదర్శి ఆర్‌హెచ్‌రెడ్డి, జోనల్ కమిటీ మెంబర్ ఆర్ముగం, డిపో అధ్యక్షుడు సుందరం, కార్యదర్శి శివకుమార్, నాయకులు రమేష్, దొరబాబు, ధనరాజ్, వీఎన్‌కె రెడ్డి, మణి, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న తపాలా ఉద్యోగులు

పుత్తూరు: సమస్యల పరిష్కారం కోరుతూ తపాలా శాఖ ఉద్యోగులు రెండవ రోజు బుధవారం సమ్మె కొనసాగించారు. స్థానిక ఎన్జీఓ కాలనీలోని హెడ్ పోస్టాఫీస్ వద్ద ఉద్యోగులు విధులు బహిష్కరించి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ నినాదాలు చేశారు. పుత్తూరు సబ్ డివిజన్ కార్యదర్శి కె.నాగయ్య మాట్లాడుతూ అఖిల భారత గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ) పిలుపు మేరకు దేశ వ్యాప్త నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. యూనియన్ నాయకులు బాబునాయుడు, వెంకటేశ్వర్లు, శ్రీధర్, సెల్వీ, మునస్వామి, సుబ్రమణ్యం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలు అందించండి



కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: రోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ లత అన్నారు. మండల పరిధిలోని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఎంపీపీ మాట్లాడుతూ రోగులు దేవతలుగా భావించే వైద్యులు మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. రాత్రి వేళలో వైద్య సిబ్బందితో పాటు, వైద్యాధికారి అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆక్సిజన్, పాముకాటుకు, కుక్కకాటుకు మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజువారీ ఓపీ సరళీ రిజిస్టర్ పరిశీలించారు. ఎంపీపీ వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఎంపీడీఓ మోహన్‌మురళి, డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ హేమశ్రీ, పలువురు వైద్య సిబ్బంది ఉన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



చిత్తూరు రూరల్: బంగారుపాళ్యం మండలంలో ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. మహాసముద్రం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న లోకనాథన్ (51) అనే వ్యక్తి వద్ద నుంచి 15 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ట్రైనీ సీఐ శ్రీరాం, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం :ఇద్దరి అరెస్టు

చిత్తూరు అర్బన్: సారా తయారు చేస్తున్న ఇదరిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) చిత్తూరు అర్బన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మండలంలోని రాసనపల్లె అటవీ ప్రాంతంలో సీఐ జోగేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా కాస్తున్న రాసనపల్లెకు చెందిన డి.జాన్సన్ (55), ఆర్.సూర్య (21)ను పట్టుకున్నారు. నిందితుల నుంచి 50 లీటర్ల సారా, 200 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. వారిని అరెస్టు చేసి, న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు. జాన్సన్‌పై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయన్నారు. అక్రమ మద్యం, సారా తయారీలో ఎక్కువ కేసులు ఉన్నవారిపై పీడీ యాక్టు నమోదుకు ప్రతిపాదనలు పంపనున్నట్టు సీఐ తెలిపారు.

నగరిలో అభివృద్ధి పరుగులు

గత టీడీపీ హయాంలో నగరి నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉండేది. ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా.. రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు అంతంతమాత్రమే ఉండడంతో ప్రజలు అవస్థలు పడేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడంతోనే నియోజకవర్గానికి అవసరమైన మౌలిక వసతులు సమకూరాయి. రూ.కోట్లాది అభివృద్ధి పనులు జరిగాయి. మంత్రి ఆర్కేరోజా నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిసారించి అభివృద్ధికి అవసరమయ్యే నిధులు మంజూరు చేయిస్తుండంతో దీర్ఘకాలిక సమస్యలు సైతం పరిష్కారమవుతున్నాయి. గురువారం పలు అభివృద్ధి పనులకు మంత్రి ఆర్కే రోజా భూమి పూజ చేయనున్నారు.

- రూ.కోటి వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం
- నేసనూరులో వన్నెకుల క్షత్రియ సంఘు కల్యాణ మండపం, వృద్ధాశ్రమం
- కీళపట్టులో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్
- నేడు భూమి పూజ చేయనున్న మంత్రి ఆర్కేరోజా



జగనన్న టౌన్‌షిప్ ముఖద్వారం నమూనా

నగరి: నగరి నియోజకవర్గం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. ఇప్పటికే పలు అభివృద్ధి పనులకు పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజు శ్రీకారం చుట్టి పూర్తి చేయించగా, మరికొన్ని అభివృద్ధి దశలో ఉన్నాయి. గురువారం పుత్తూరు మండలం కృష్ణసముద్రంలో తుడా నిధులు రూ.49 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, నగరి మున్సిపాలిటీలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో 2వ వార్డు కాకవేడులో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, 3వ వార్డు ఎకెఎన్ లేఅవుట్‌లో రూ.15 లక్షల వ్యయంతో, 8వ వార్డు కీళపట్టు బీసీ కాలనీలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించే సిమెంట్ రోడ్డు పనులకు భూమి పూజ చేయనున్నారు.

కీళపట్టులో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్

నగరి మున్సిపాలిటీ కీళపట్టులో తుడ నిధులతో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ నూతనంగా ఏర్పాటు కానుంది. ప్రహరీగోడ, ముఖ ద్వారాలతో పార్కులు, వీధి దీపాలు, వర్షపు నీటి కాలువలు, నిరంతర విద్యుత్ సరఫరా, భూగర్భ మురుగుకాలువ, నీటి సరఫరా, కలర్ టైల్స్ ఫుట్‌పాత్‌లు, 40, 60 అడుగుల సిమెంటు రోడ్లు వసతులతో 91 ప్లాట్లు టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం ప్లాట్లను 20 శాతం రిబేటుతో, ప్రభుత్వ పెన్షనర్లకు 5 శాతం ప్లాట్లను రిబేటు లేకుండా అందించనున్నారు. ప్లాట్లకు దరఖాస్తు చేసే సమయంలో 10 శాతం చెల్లించాల్సి ఉండగా, మిగిలిన 90 శాతం డబ్బులను నెలరోజుల లోపు, ఆరు నెలలలోపు, ఏడాది లోపు అంటూ మూడు విడతలుగా చెల్లించుకునే అవకాశం కల్పిస్తున్నారు. రిజిస్ట్రేషన్, డీటీసీపీ అప్రూవల్ లాంటి సౌకర్యాలతో చిత్తూరు–తచ్చూరు జాతీయ రహదారి పక్కనే ఏర్పాటు చేసే జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌కు మంత్రి ఆర్కేరోజా నేడు భూమి పూజ చేయనున్నారు.



జగనన్న టౌన్‌షిప్ ప్లాన్

నెరవేరిన వన్నెకుల క్షత్రియుల కల

కల్యాణ మండపం, వృద్ధాశ్రమం నిర్మాణ స్థలం కోసం ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న వన్నెకుల క్షత్రీయుల కోరికను మంత్రి ఆర్కేరోజా నెరవేర్చారు. ముఖ్యమంత్రి దృష్టికి వీరి సమస్యను తీసుకెళ్లి పుత్తూరు మండలం నేసనూరు గ్రామంలో 1.04 ఎకరాలు మంజూరు చేయించారు. ఇక్కడ వన్నెకుల క్షత్రియ సంఘ కల్యా ణ మండపం, వృద్ధాశ్రమానికి గురువారం మంత్రి భూమి పూజ వేయనున్నారు.

సమష్టి సహకారంతో మార్కెట్ అభివృద్ధి



ఎంపీడీఓను సన్మానిస్తున్న ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, డైరెక్టర్లు

పెనుమూరు (కార్వేటినగరం): మార్కెట్ యార్డు అభివృద్ధికి కమిటీ సభ్యుల సహకారం ఎంతో అవసరమని పెనుమూరు ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి అన్నారు. ఏఎంసీ కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం కమిటీ డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ పాలకవర్గం కాలపరిమితి అక్టోబర్ 17వ తేదీ నాటికి ముగిసిందని, అయితే నవంబర్ 22వ తేదీ నుంచి ఆరు నెలల వరకు కాలపరిమితి పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. జైన్ ఫామ్‌ఫ్రెష్ వారు బకాయి పడిన రూ.47 లక్షలలో రూ.35 లక్షలు చెల్లించినట్లు వివరించారు. మార్కెట్ యార్డుకు వచ్చే నిధులను యార్డు అభివృద్ధికి వెచ్చించనున్నట్లు చెప్పారు. అనంతరం ఎంపీడీవో నీలకంఠేశ్వరరెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రమేష్, వనజాక్షి, భారతి, సురేఖ, రమాదేవీ, అలీషేర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన



శ్రీకావేరిరాజుపురం సచివాలయంలో అవగాహన కల్పిస్తున్న డీటీ మధుబాబు

పాలసముద్రం : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లపై ప్రతి ఓటరు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు తెలిపారు. శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం సర్పంచ్ గాలి మహేష్ బాబు, వీఆర్‌ఓ తంగరాజ్ సమక్షంలో ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు ఈవీఎంలపై పారదర్శకంగా పోలింగ్ జరుగుతుందని చెప్పారు. ఓటర్లు తాము ఏ గుర్తుకు ఓటు వేశారో వీవీపాట్ యంత్రంలో సరిచూసుకోవచ్చన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఈవీఎం, వీవీపాట్‌ల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో గ్రామీణ రోడ్లకు మహర్దశ



రాచపాళ్యంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చిందని ఎంపీపీ లత అన్నారు. మండలంలోని కృష్ణాపురం పంచాయతీ రాచపాళ్యంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ ధనశేఖర్‌వర్మ ఆధ్వర్యంలో బుధవారం భూమి పూజ చేసి, పనులు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం గ్రామీణ రోడ్లను విస్మరించిందని గుర్తుచేశారు. నేడు సీఎం జగనన్న రాష్ట్రాభివృద్ధికి పట్టుకొమ్మలైన గ్రామాల అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు ఏర్పాటులో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాత్ర ఎంతో ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన నారాయణస్వామికి గ్రామస్తుల సీసీ రోడ్డు కోసం విన్నవించినట్లు గుర్తుచేశారు. ఆ విన్నపం మేరకు, రాచపాళ్యం, క్రిష్ణాపురం, ఏఎంఆర్ కండ్రిగ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, దామోదర్‌రాజు, మధు ఎంపీడీఓ మోహన్‌మురళి పాల్గొన్నారు.

తోటి వేషంతో అలరించిన భక్తులు



తోటి వేషాలతో వీధుల్లో జాతర దండోరా

కార్వేటినగరం: మండల కేంద్రంలోని గంగజాతరను పురస్కరించుకుని బుధవారం భక్తులు వేసిన తోటి వేషం అలరించింది. తూర్పు వీధికి చెందిన విశ్రాంత ఆర్టీసీ డ్రైవర్ సుబ్రమణ్యం రాజు, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి క్రిష్ణయ్య, కరణం చంద్రశేఖర్, రామ్మూర్తి, జగదీష్, తులసిరెడ్డి కలసి తోటి వేషాలతో గ్రామ వీధుల్లో తిరుగుతూ జాతర చాటింపు వివరాలను వెల్లడిస్తూ దండోరా వేశారు. అనంతరం శ్రీబంగారమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధ్యక్షుడు కే.ప్రసాద్ వారికి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై పాల్గొన్నారు.

మానవీయ విలువలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయులురెడ్డి

కార్వేటినగరం: విద్యార్థులకు మానవీయ విలువలపై అవగాహన అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన మానవీయ విలువలు, వృత్తి ధర్మాలు సదస్సులో ఆయన పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులకు మానవీయ విలువలను వరించారు. విలువలు పాటించడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించవచ్చని చెప్పారు. ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ స్వరూప మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్ పరీక్షలలో ఎథిక్స్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కమలాకర్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశన్, రాజేష్‌కుమార్, డాక్టర్ మాధవనాయుడు, సుబ్బారావు, కృష్ణకిషోర్, మునెమ్మ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో వైకల్యం నయం



ఫిజియోథెరపీ చేస్తున్న అనుషా

పాలసముద్రం : ఫిజియోథెరపీతోనే వైకల్యం నయం చేసుకోవచ్చని ఎంఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ఫిజియో థెరపిస్టు అనుషా దివ్యాంగ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కూర్చోవడానికి, నిలుచోవడానికి, నడవడానికి ఇబ్బందులు పడుతున్న పిల్లలకు భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ చేస్తామన్నారు. ఫిజియోథెరపీని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ టీచర్లు పి.విమరాజు, టీ.బాలాజి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నియామకం



రాఘవేంద్ర

చిత్తూరు కలెక్టరేట్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యునిగా పూజారి రాఘవేంద్ర ఎన్నికయ్యారు. ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన జాతీయ మహాసభల్లో ఆయన్ను ఎన్నుకున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్ శరణ్ షాహి ప్రకటించారు. ఎన్నికైన రాఘవేంద్ర మాట్లాడుతూ జాతీయ కార్యవర్గంలో అవకాశం లభించడం ఆనందకరమన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

శ్రీవారి సేవలో ఉడిపి పీఠాధిపతి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఉడిపిలోని సోడి వడిరాజా మఠం పీఠాధిపతి విశ్వ వల్లభ దత్త స్వామీజీ దర్శించుకున్నారు. బుధవారం తిరుమల శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు రిసెప్షన్ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

తుపానుతో దెబ్బతిన్న పంటల పరిశీలన



నింద్ర : వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

నింద్ర: మిచాంగ్ తుపాన్‌తో దెబ్బతిన్న పంటలను బుధవారం రైతు భరోసా కేంద్రం మండల కమిటీ చైర్మన్ వీరయ్య, మండల వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఎంఎస్‌పురం, ఆరూరు, అగరం, ఇరుగువాయి గ్రామాల్లో వరి, మిరప, వేరుశెనగ, పంటలను పరిశీలించి వివరాలను సేకరించారు. రైతులకు సూచనలు ఇచ్చారు. ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవసరమైన ఎరువులు, ఉద్దులు, పెసలు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది, వ్యవసాయాధికారి తులసీరాం అధికారులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే జాతీయ అవార్డు ప్రదానం



అవార్డుతో కుప్పయ్య శెట్టి

నగరి : మండలంలోని మాంగాడు గ్రామానికి చెందిన చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కేవీ కుప్పయ్య శెట్టి మహాత్మా జోతిరావ్ పూలే జాతీయ అవార్డును అందుకున్నారు. ఈనెల 10వ తేదీన న్యూఢిల్లీ భారతీయ దళిత సాహిత్య అకాడమీ నిర్వహించిన ప్రధానోత్సవంలో అకాడమీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్పీ సుమనస్కర్ ఆయనకు అవార్డును అందించారు. 1991 నుంచి నేతవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న ఈయన చేనేత కార్మికులకు వృత్తి శిక్షణ ఇవ్వడం, మార్కెటింగ్, చేనేత చట్టాల అమలుకు చేసిన పోరాటాలు, సదస్సులు నిర్వహించడం లాంటి సేవలకు గాను అవార్డు దక్కింది. గతంలో చేనేత కార్మిక యూనియన్ చిత్తూరు జిల్లా కోశాధికారిగా, అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన 2008 వ సంవత్సరంలో భారతీయ దళిత సాహిత్య అకాడమీ వారిడాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జాతీయ అవార్డును కూడా అందుకున్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలకు సన్నద్ధం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామనాథరెడ్డి

పాలసముద్రం : 'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు సన్నద్ధం కావాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ ఎస్. శివప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ సమక్షంలో పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రామనాథరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు ఈ నెల 15వ తేదీ నుంచి మండల వ్యాప్తంగా ప్రారంభం కానున్నాయని చెప్పారు. దీనికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. క్రీడా మైదానాల్లో క్రీడాకారులకు అవసరమైన తాగునీరు, భోజన వసతి తదితరాలను సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తులసీరామ్ యాదవ్, ఎంపీటీసీ గోవిందరాజు, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, అయ్యప్ప, జీ.మహేష్ బాబు, విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చదువే విలువైన సంపద



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

నగరి : చదువు చాలా విలువైన సంపదని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. వేణుగోపాల్ అన్నారు. బుధవారం డిగ్రీ కళాశాల ఆవరణంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం జరిగింది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు బాగా చదివించుకోవాలన్నారు. కొందరు కళాశాలకు సక్రమంగా రాకపోవడం వల్ల పరీక్షల్లో తప్పిపోతున్నారని, తద్వారా భవిష్యత్తు పాడైపోతుందన్న విషయాన్ని గుర్తించాలని తెలిపారు. కొందరు తల్లిదండ్రులు పిల్లలను కూలి పనులకు పంపుతున్నారని, వారి జీవిత నాశనానికి వారే కారణమౌతున్నారన్నారు. పిల్లలు కళాశాలకు వస్తున్నారా, జులాయిగా తిరుగుతున్నారా అని తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందని తెలిపారు. పిల్లలను సెల్ ఫోన్లకు దూరం చేయాలని లేకుంటే చదువులకు దూరం అవుతారన్నారు. అధ్యాపకులు డాక్టర్ ఎం.పంకజ, డాక్టర్ పి.మహేశ్వరి, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ గిరీష్ ,ఉమామహేశ్వరి, జ్యోతి కుమార్, పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం



ఇంటింటి ప్రచారంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు

గంగాధర నెల్లూరు: సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగనన్నను మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పలువురు నాయకులు అన్నారు. మండలంలోని వీరకనెల్లూరు గ్రామ సచివాలయంలో బుధవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ గోవిందయ్య మాట్లాడుతూ సీఎం జగనన్న పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు నవరత్నాలను 99 శాతం నెరవేర్చారని అన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో జగనన్న దేశానికే ఆదర్శం అని, అలాంటి సీఎం ఉంటేనే అభివృద్ధి సాధ్యం అన్నారు. వీరకనెల్లూరు గ్రామ పంచాయతీలో పథకాల లబ్ధి బోర్డు ఆవిష్కరించి, పార్టీ జెండా ఎగుర వేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సుధాకర్, సచివాలయ కన్వీనర్ మధు, ఈవోపీఆర్డీ రాఘవేంద్ర రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ వెంకటేష్ రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆలయాల్లో ధనుర్మాస ప్రత్యేక కార్యక్రమాలు

తిరుపతి (అలిపిరి): టీటీడీ స్థానిక ఆలయాల్లో ధనుర్మాసం సందర్భంగా డిసెంబరు 17 నుంచి జనవరి 14 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 16న రాత్రి 12.34 గంటలకు ధనుర్మాసం ప్రారంభమవుతాయని చెప్పారు. శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో డిసెంబరు 17 నుంచి జనవరి 14 వరకు రోజూ ఉదయం 4 నుంచి 6 గంటల వరకు సుప్రభాతం స్థానంలో ఏకాంతంగా తిరుప్పావై పారాయణం, భక్తులకు ధనుర్మాస దర్శనం కల్పిస్తామని తెలిపారు. అయితే సుప్రభాతం సేవా టికెట్లు జారీ చేయరని, భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

పద్మావతి అమ్మవారి ఆలయంలో..

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా డిసెంబరు 17 నుంచి జనవరి 14వ తేదీ వరకు భక్తులకు ధనుర్మాస దర్శనం కల్పిస్తారు. మొదటిరోజు డిసెంబరు 17న సాయంత్రం ధనుర్మాసం గంట ఉంటుందని, దీంతో సహస్ర దీపాలంకార సేవ రద్దయింది. ఆలయంలో నెల రోజుల పాటు ఉదయం 4.30 నుంచి 6 గంటల వరకు ధనుర్మాసం గంట, ధనుర్మాస దర్శనం ఉంటుంది. అలాగే తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయంలో ఉదయం 4 నుంచి 5.30 గంటల వరకు సుప్రభాతం స్థానంలో తిరుప్పావై పారాయణం, భక్తులకు ధనుర్మాస దర్శనం కల్పిస్తారు. తిరుపతిలోని శ్రీ కోదండరామాలయంలో ఉదయం 4 నుంచి 5 గంటల వరకు ధనుర్మాస కైంకర్యాలు, ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు భక్తులకు ధనుర్మాస దర్శనం కల్పిస్తారని తెలిపారు.

ఆటోల్లో చోరీల నివారణకు చర్యలు

చిత్తూరు అర్బన్: ఆటోల్లో ప్రయాణికుల నుంచి చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని చిత్తూరు వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి సూచించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఇటీవల ఆటోల్లో ప్రయాణించే వారు వస్తువులను పోగొట్టుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యానికి చేర్చే బాధ్యత డ్రైవర్లదేనన్నారు. ప్రయాణికులు దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సదస్సులో ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ఎస్ఐలు మల్లికార్జున, జయప్ప తదితరులు పాల్గొన్నారు.